ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 26 ఫిబ్రవరి 2025 | 5





శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ధవళేశ్వరం అగస్తేశ్వరుడు

మహా.. శివుడు



మండపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివుడు మన చెంత కొచ్చాడు.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో కొలువయ్యాడు.. దేశంలో ఆదియోగి భారీ విగ్రహాలు కోయంబత్తూరు, బెంగళూరుల్లో 112 అడుగులు చొప్పున రెండు ఉన్నాయి. ద్వారపూడిలో మూడోది కొలువుదీరింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగులు వెడల్పుతో నిర్మించిన ఈ విగ్రహాన్ని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 5.30 గంటలకు ఆవిష్కరించనున్నారు. తమిళనాడుకు చెందిన ఎస్ఎల్ కనకరాజు చాలా ఏళ్ల కిందట ద్వారపూడి వచ్చి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఆయన ఇటీవల బెంగళూరులోని తన కుమారుడి వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ద్వారపూడిలో కూడా ఇలాంటి విగ్రహం ఏర్పాటు చేయాలని బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి పడాల పెదరాఘవను సంప్రదించారు. పది నెలల్లో రూ.30 లక్షలు ఖర్చుచేసి విగ్రహాన్ని ఇలా తయారు చేశారు. విగ్రహం వెనుక భాగం లోపల శివలింగంతోపాటు 40 మంది వరకు కూర్చుని ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహం ముందు వినాయకుడు, కుమారస్వామి, నాలుగు వైపులా వశిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, జమదగ్ని, విశ్వామిత్ర, వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

శివరాత్రికి ముస్తాబు



శివరాత్రి వెలుగులు : విద్యుత్ ధగధగల మధ్య పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. గోదావరి రేవులు సిద్ధమయ్యాయి.. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రాధాన్యం పెరిగింది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రధాన ఆలయాలు ఉన్నాయి.. ఆయా ఆలయాలకు భక్తజనం పోటెత్తుతారు. రాజమహేంద్రవరం, కొవ్వూరులో అఖండ గోదావరికి భక్తజనం తండోపతండాలుగా తరలివస్తారు.. ఈ సందర్భంగా ఆలయాలు.. గోదావరి రేవుల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. - లోపల పేజీల్లో

శివాలయానికో.. చరిత్ర!

శివాలయాలకు ఒక్కో ఊరిలో ఒక్కో పేరు.. ఆలయాలకు వెళతాం..ఆ ఆది దేవుడిని దర్శించుకుని వచ్చేస్తాం.. ఆ ఆలయానికి ఆ పేరు ఎలా వచ్చిందంటే ఆలోచనలో పడతాం.. ప్రతి ఆలయానికి ఆ పేరు రావడానికి ఓ చరిత్ర ఉంది.. అదేమిటో తెలుసుకోవాలనుందా.. అయితే ఒకసారి 6వ పేజీలోకి వెళ్లాల్సిందే మరి..

6

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

రేపే ఎమ్మెల్సీ పోలింగ్

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గురువారం పోలింగ్ జరగనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 62,970 మంది ఓటర్లకు 92 పోలింగ్ కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లకు 95 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 70,504 మంది ఓటర్లకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం అధికారులకు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయనున్నారు. బరిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీపడతారు. హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులంతా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రచారంలో ఎక్కడా చిన్నపాటి వివాదాలు తలెత్తలేదు. ప్రచారం ప్రశాంతంగా ముగిసింది.

7



మల్కిపురం మండలం గూడపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం. చిత్రంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్

నిషేధిత మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో సమన్వయ సెంటర్ (ఎన్‌సీవోఆర్‌డీ) సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 2,700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 900 మంది వరకూ మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లపై నిఘా పెట్టి అరికట్టామన్నారు. ఇప్పటి వరకూ 140 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వీళ్ల దగ్గ మందు ఎక్కువ మోతాదులో తాగిన మత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పాడుతున్నట్టు గుర్తించామన్నారు. విశాఖ డివిజన్ ఎన్‌సీబీ బృందం సభ్యులు అభిజిత్, రోహన్, డి.నాగమణి, డీటీఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):సింహాచలనగర్‌లోని క్వారీ గోతుల ప్రాంతంలో గంజాయి నిల్వ చేస్తున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు సోదాలు చేశారు.క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన మేకల గణేశ్,ఆవుల అబి,సీటీఆర్‌ఐకి చెందిన ఉగ్గిన దుర్గాప్రసాద్,తాడికొండ శామ్యూల్ ప్రతాప్, తొండా పోతురాజు(గోకవరం)ను అరెస్ట్ చేసి 20.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్య

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒకరు ఆర్థిక ఇబ్బందులు.. మరొకరు అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఆదెమ్మ దిబ్బ ప్రాంతంలోని వాంబే కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్న ఆటో డ్రైవరు కరణం రాము (30) ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంగళవారం ఉదయం ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు.జేఎన్ రోడ్‌లో నివా సం ఉంటున్న ఆళ్ల సంతోశ్(40) అనారోగ్యం కారణంగా సోమవారంపురుగుల మందు తాగాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 92 పోలింగ్ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో జిల్లాలోని 92 పోలింగ్ కేంద్రాలకు, 15 రూట్ల ద్వారా బుధవారం పోలింగ్ మెటీరియల్ పంపిస్తామని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు 400 మంది పోలీసులను నియమించామన్నారు. పోలింగ్ సందర్భంగా గురువారం అన్ని పాఠశాలలకు పాఠశాల విద్యా కమిషనర్ సెలవు ప్రకటించడం జరిగిందని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు.ఆమె వెంట సహాయ రిటర్నింగ్ అధికారి టి.సీతారామ్మూర్తి, ఆర్డీవో కృష్ణ నాయక్ ఉన్నారు.

స్నేహితుల దుర్మరణం

7 ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

'కోటి' ఫలితాల క్షేత్రం



పురాణ ప్రసిద్ధిగాంచిన కోటిపల్లి

(ఆంధ్రజ్యోతి- కె.గంగవరం)

కోటిపల్లి పుణ్యక్షేత్రంలో ఏ పుణ్య కార్యం చేసినా కోటి ఫలితాలు సిద్ధిస్తాయని పురాణ ప్రసిద్ధి. గోదావరి నది ఒడ్డున ఉన్న కోటిపల్లి పుణ్యక్షేత్రంలో రాజరాజేశ్వరి సహిత ఛాయా సోమేశ్వరస్వామి, అమ్మవారితో కూడి కోటేశ్వరస్వామి, శ్రీదేవి భూదేవి సహిత సిద్ధి జనార్దనస్వామి వేంచేసి ఉన్నారు. బ్రహ్మాండ పురాణం ప్రకారం ఈ మూడు విగ్రహాలను ఇంద్రుడు, చంద్రుడు, కశ్యపమహర్షి ప్రతిష్ఠించారని చెబుతోంది. తాము చేసిన పాపాలు పోగొట్టుకోవడానికి ఇంద్రుడు ఉమాసమేతుడైన కోటేశ్వర లింగాన్ని, రాజరాజేశ్వరి సమేతుడైన ఛాయా సోమేశ్వరుడిని చంద్రుడు ప్రతిష్ఠించారని, సిద్ధి జనార్దనస్వామిని కశ్యప మహర్షి ప్రతిష్ఠించాడని, ఆయన క్షేత్రపాలకుడని అంటారు. ఈ క్షేత్రం గోదావరికి ఉత్తరపు ఒడ్డున ఉంది. గౌతమ మహర్షి దీన్ని ఇటువైపు మళ్లించాడని కథనం. ఇందులో స్నానాలు ఆచరిస్తే చేసిన సర్వ పాపాలు పోతాయని ప్రతీతి.


ప్రతి శైవ క్షేత్రానికి ఓ ప్రత్యేక నామం.. పురాణ విశిష్టతలెన్నో.. 'ఉమ్మడి' గోదావరి ఆధ్యాత్మిక ధామం

ఆది దేవుడు శివుడు. సృష్టికి మూలకారకుడు అతడే. అందుకే పరమాత్మగాను, రుద్రుడిగానూ కొలుస్తాం. సదాశివుడు అంటే ఆది అంతం లేనివాడని అర్థం. అందుకే శివుడిని ఆరాధించని వాళ్లు అరుదు. ముఖ్యంగా మన గోదావరి జిల్లాల్లో ఉన్న శైవ క్షేత్రాలు ఇంకెక్కడా ఉండవేమో. పంచారామ క్షేత్రాల్లో రెండు మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఉన్నాయి. ద్రాక్షారామ, సామర్లకోటల్లో అవి కొలువై ఉన్నాయి. ఇవిగాకుండా కోటిపల్లి శైవ క్షేత్రం ఎంతో ప్రసిద్ధి చెందింది. రాజమహేంద్రవరంలో కోటిలింగాల క్షేత్రం, పిఠాపురంలో పాదగయ, కోనసీమలో కుండలేశ్వరం విశిష్టమైన శైవక్షేత్రాలు. ఇలా ప్రధానమైన శైవ క్షేత్రాల స్థల పురాణాలు కూడా ఆసక్తికరమే. అసలు ఆయా శైవ క్షేత్రాల్లో శివుడికి ఆ పేర్లు ఎందుకొచ్చాయో తెలియజేసే ప్రత్యేక కథనం..





కోడి రూపంలో శివుడు



గయాసురుడిని సంహరించేందుకు కోడి రూపం ధరించి ఇక్కడ లింగరూపుడు అయ్యాడు పరమశివుడు. కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామిగా భక్తులతో పూజలు అందుకుంటున్నారు. ఇక్కడ గయాసురుడి విగ్రహం కూడా ఉంటుంది. గయాసురుడిని సంహరించినప్పుడు పాదాలు ఇక్కడ పడడంతో ఇది పాదగయగా ప్రసిద్ధి గాంచింది. పూర్వం గయాసురుడనే రాక్షసుడు ఉండేవాడు. ఇతను చేసే సత్కార్యాలు, దానధర్మాలతో ఇంద్రాదిపత్యం కలిగింది. త్రిలోకాలను పాలిస్తూ ప్రజల మన్ననలను పొందాడు. దీంతో దేవతలు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను శరణు కోరారు. ఏదడిగినా దానమిచ్చే గుణమున్న గయాసురుని వద్దకు త్రిమూర్తులు మారువేషాల్లో వచ్చారు. లోకం సుభిక్షంగా ఉండాలని ఒక యజ్ఞం తలపెట్టామని, దానికి మీ సహకారం కావాలని కోరారు. దానికి గయాసురుడు అంగీకరించాడు. ఏడు రోజులపాటు జరిగే ఈ యజ్ఞానానికి భూమి, ఆకాశాలు పనికిరావని, నీ శరీరాన్నే వేదికగా చేయాలని కోరగా అంగీకరించాడు. ఆరు రోజులు పూర్తయిన అనంతరం ఏడవ రోజున తెల్లవారుజాము కాకుండానే శివుడు కోడి(కుక్కుటం) ఆకారం ధరించి కొక్కొరొకో అని కూత కూశాడు. దీంతో యజ్ఞం పూర్తయిందని భావించి గయాసురుడు యజ్ఞవేదికగా ఉన్న తన శరీరాన్ని కదిపాడు. దీంతో ఆగ్రహించిన త్రిమూర్తులు నీ వల్లే యజ్ఞం భంగం అయిందని, కనుక సంహరిస్తామని చెప్పి వరం కోరుకోమన్నారు. అతని కోరిక మేరకు గయాసురుడి శరీర భాగాలు పడినచోట పితృకార్యాలు చేసి గయాశ్రార్ధమస్తు గయ గయ అని ఉచ్ఛరిస్తే పితృకార్యం సఫలం అవుతుందని వరమిచ్చారు. అనంతరం గయాసురుడి శరీరాన్ని మూడు భాగాలు ఖండించారు. శిరస్సు బీహార్‌లోని గయలో పడగా శిరోగయ, నాభి ఒరిస్సాలోని జాజిపూర్‌నందు గల గయలో పడగా నాభిగయ, పిఠాపురంలో పాదములు పడడంతో పాదగయగా పిలువబడుతూ ప్రసిద్ధిగాంచాయి. గయాసురుని సంహరించడానికి శివుడు కోడిరూపాన్ని ధరించినందున ఈ క్షేత్రంలో స్వయంభువ కోడిరూపమున స్ఫటిక లింగాకారంలో వెలసి కుక్కుటేశ్వరుడిగా పూజలు అందుకొంటున్నారు.

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

ఓం నమశ్శివాయ..

ప్రతిక్షేత్రానికి ఓ నామం.. ప్రతి నామానికి ఓ ప్రాశస్త్యం



'కుండల' ఈశ్వరం

కుండలేశ్వరంలో వృద్ధ గౌతమిలో స్నానమాచరించి కుండలేశ్వరుని కరుణాకటాక్షాల కోసం అర్రులు చాస్తున్నామని పవిత్ర కాశీలోని పండితులు అంటుంటే తాను ఆశ్చర్యానికి లోనైనట్టు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారంటే కుండలేశ్వర విశిష్టత ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. అమలాపురానికి సమీపంలో వృద్ధ గౌతమీ నదీతీరాన కాట్రేనికోన మండలంలో ఉన్న కుండలేశ్వర క్షేత్రంలో సూర్యుని కుండలాల ఆకారంలో శివలింగాన్ని గౌతమముని ప్రతిష్ఠించారని పురాణ గాథ. కవి సార్వభౌముడు శ్రీనాథ మహాకవి తన భీమఖండంలో కుండలేశ్వరం గురించి రాశాడు. కోటిపల్లిలో సోమేశ్వరుడు గాక దక్షిణ భాగం నుంచి గౌతమముని తీసుకొచ్చిన గోదావరి నది ప్రవహిస్తూ సముద్రం కేసి వెళుతోంది. చాలా వేగంగా వెళుతున్న గోదావరికి సముద్రపు ఘోష వినిపించింది. దీంతో మహా వేగంతో పాతాళలోకంలోకి ప్రవేశించి ఈ సముద్రుడితో గోదావరి భేదించాలనుకుంది. గోదావరి ఆలోచనలను నదులన్నింటికీ నాథుడైన సముద్రుడు గ్రహించి పూజా ద్రవ్యాలను, తన కుండలాలను ఒక పళ్లెంలో ఉంచి గౌతమికి ఎదురెళ్లాడు. గౌతమి నదికి కోపం పోగొట్టడానికి సాష్టాంగ నమస్కారం చేసి, సూర్యభగవానుని తేజస్సుతో మెరుస్తున్న ఈ కుండలాలను నీకు బహుమతిగా ఇస్తున్నానని తెలిపాడు. లోగడ వరుణుదేవుడి తపస్సు చేసి సూర్యుడి అనుగ్రహంతో వీటిని పొందాడని వివరించాడు. దీంతో గౌతమీ నది నెమ్మదించి అక్కడ ఈశ్వర ప్రతిష్ఠకి అంగీకరించింది. అదే కుండలేశ్వర క్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. మరో విశేషం కూడా ఉంది. ఇక పార్వతీదేవి ఆజ్ఞమేరకు వ్యాస మహర్షి కాశీని వదిలిపెట్టి విశ్వేశ్వరుని దర్శించుకోలేని పరిస్థితుల్లో అనేక క్షేత్రాలను దర్శిస్తూ కుండలేశ్వరం వచ్చాడు. దక్షయజ్ఞం తర్వాత యోగాగ్నిలో దగ్ధమైన సతీదేవి చెవి కుండలం పడిన ఈ క్షేత్రంలో గోదావరి స్నానం చేసి కుండలేశ్వరుని ఆయన దర్శించి కాశీవిశ్వేశ్వరుడిని దర్శించిన అనుభూతిని పొందాడు. అప్పుడు ఈ నదికి ఒక వరమిచ్చాడు. దేశంలో అన్ని నదులకు 12 ఏళ్లకు ఒకసారి పుష్కరం వస్తే, ఇక్కడ ప్రతిరోజూ పుష్కరమేనని వరం ప్రసాదించాడు. దాంతో గోదావరి పాయగా ఉన్న ఈ వృద్ధ గౌతమిలో ఏరోజు స్నానం చేసి పుష్కర స్నాన ఫలం పొందుతారు.

(ఆంధ్రజ్యోతి -కాట్రేనికోన)



కోటి లింగాల క్షేత్రం..



(ఆంధ్రజ్యోతి- రాజమహేంద్రవరం సిటీ)

కాశీ తర్వాత అంత ప్రాముఖ్యత కలిగిన క్షేత్రంగా రాజమహేంద్రవరం ఉమాకోటిలింగేశ్వర క్షేత్రానికి పేరుంది. చారిత్రక రాజమహేంద్రవరంలో పదవ శతాబ్దంలో ఈ ఆలయం నిర్మించారని చెబుతారు. పూర్వకాలంలో పరమశివుడు శివతాండవంలో శివుడు జటాజూటలో కొన్ని జటాజూటాలు రాలి గోదావరి తీరాన పడ్డాయని. అవి శివలింగాలుగా మారి కోటిలింగాలుగా అవతరించాయని పురాణ కథనం. ప్రస్తుతం కోటిలింగేశ్వరుడు కొలువై వున్న ఈ క్షేత్రంలో అంతర్ భూగర్భంలో కోటి శివలింగాలు ఉన్నాయని చెబుతారు. శ్రీరామచంద్రుడు వనవాస కాలంలో ఈ ఆలయాన్ని సందర్శించారనే చరిత్ర కూడా ఉంది. అందుకే ఈ ఆలయంలో రామాలయం కూడా ఉంది. శ్రీసీతారాములు విగ్రహాలు కూడా కొలువై పూజలు అందుకుంటాయి. ఉమాకోటిలింగేశ్వరస్వామి కొలువైన ఈ ప్రాంతంలో ఉన్న గోదావరి రేవుకు కోటిలింగాల రేవుగా పిలుస్తారు. దేశంలో ఎక్కడెక్కడ నుంచో వచ్చి చితాభస్మాన్ని కోటి లింగాల రేవులోనే నిమజ్జనం చేస్తారు.

కేదారేశ్వరా..



బిక్కవోలు, (ఆంధ్రజ్యోతి):తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బిక్కవోలులో తూర్పు చాళుక్యుల కాలంలో నిర్మించిన కేదారేశ్వరస్వామి ఆలయంలో స్వామిని మహాశివరాత్రి రోజున మాత్రమే పూజలందుకుంటాడు. 1100 ఏళ్ల కిందట ఈ ఆలయాన్ని నిర్మించారు. పిండారీలు, మహ్మదీయుల దండయాత్రలో ఆలయాన్ని ధ్వంసం చేయగా 15 ఏళ్ల కింద నుంచి కేంద్ర పురావస్తు శాఖ ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి నుంచి గ్రామస్తులు మహాశిరాత్రి రోజున స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయం ముందు దీపాలు వెలిగించడానికి అరప కూడా ఏర్పాటు చేశారు. అలాగే గురువారం మధ్యాహ్నం స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

దక్షిణ కాశీ..ద్రాక్షారామ



దక్షిణ కాశీగా పేరొందిన అతిప్రాచీన శైవక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వరాలయం. ఇది పంచారామ క్షేత్రం కూడా. రామచంద్రపురం మండలంలోని ద్రాక్షారామ గ్రామంలో ఉంది. పురాణకథనం ప్రకారం దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని మథించిన సమయంలో ఆత్మలింగం ఉద్భవించింది. దీనిని తారకాసురుడు అనే రాక్షసుడు మెడలో ధరించి శివుని కోసం ఘోర తపస్సు చేస్తాడు. శివుడు ప్రత్యక్షమై దేవతలపై యుద్ధం చేయ సంభవించిన పక్షంలో తనపైగాని తన సంతతిపైగాని యుద్ధం చేయనంతవరకు అతడికి మరణం సంభవించదని వరమిస్తాడు. కాలగమనంలో దేవాసురుల సంగ్రామంలో శివుని కుమారుడు కుమారస్వామితో తారకాసురుడు తలపడతాడు. దీంతో తారకాసురుడి శిరస్సు వేయి ఖండాలుగాను, ఆత్మలింగం ఐదు ఖండాలుగాను అవుతుంది. ఆత్మలింగం శకలాల్లో ఒకటి ఇంద్రునిచే అమరావతిలో, రెండవ శకలం చందునిచే భీమవరంలో, మూడవశకలం శ్రీరామునిచే పాలకొల్లులో, నాలుగవ శకలం సామర్లకోటలో, ఐదవ శకలం ద్రాక్షారామలో సప్తమహర్షులచే ప్రతిష్ఠించే సమయానికి స్వయంభువునిగా వెలసినట్టు కథనం. పాలసముద్రం మథన సమయంలో భీమమైన హాలాహలం జనించింది. శివుడు భువనసంహారకమైన హాలాహలాన్ని మింగి కంఠాన ధరించాడు. భీమమైన కాలకూట విషం మింగి రక్షించడంతో భీమేశ్వరునిగా ఖ్యాతి చెందాడని చెబుతారు. చరిత్రపరంగా మొదటి చాళుక్య భీముని కాలంలో భీమేశ్వరాలయం 892-922 మధ్య నిర్మించినట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. చాళుక్యభీమునిచే నిర్మించిన ఆలయం భీమేశ్వరాలయంగా, భీమేశ్వరస్వామిగా పేర్కొన్నట్టు చెబుతారు. చాళుక్యభీముడు పాలించిన ప్రాంతం భీమమండలంగా ఉండేది. భీమేశ్వరస్వామి కేంద్రంగా అంతర్వేది నుంచి పట్టిసీమ వరకు భీమమండలం ఉందని, భీమమండలంలో 116 శివలింగాలు శివాలయాలు ఉన్నట్టు చెబుతున్నారు. ఇందుకు తార్కాణంగా శివలింగాలతో కూడిన భీమసభ ఆలయంలో ఉంది.

● (ఆంధ్రజ్యోతి -ద్రాక్షారామ)

కుమారరామ..భీమేశ్వర



సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామభీమేశ్వరుడు కూడా పంచారామ క్షేత్రాల్లో ఒకటి. ఆత్మలింగ నాలుగో శకలం ఇక్కడ పడడంతో అది గొప్ప శైవ క్షేత్రంగా పేరొందింది. కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయాన్ని క్రీ.శ. 892 నుంచి 922 వరకూ తూర్పు చాళుక్య రాజుల కాలంలో నిర్మించారు. దాంతో ఇది కూడా చాళుక్య భీముడి ఆలయంగా ప్రసిద్ధి చెందింది. శ్రీకుమార రామ భీమేశ్వరస్వామి వారి దేవేరిని ఇక్కడ శ్రీబాలాత్రిపురసుందరి అని అమ్మవారిగా పిలుస్తారు. అదేవిధంగా పురాణ కథనం ప్రకారం తారకాసురుడిని కుమారస్వామి వధించడంతో కుమార రామ భీమేశ్వరుడిగా ప్రసిద్ధి చెందినట్టు చెబుతారు.



హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారిణులు

మగువలు... మెరికలు

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటులో సత్తా చాటుతున్న మహిళలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. మహిళల విభాగంలో జరిగిన మూడు మ్యాచ్‌లను డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పర్యవేక్షించారు. సెంట్రల్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 1-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 10-2 తేడాతో విజయం సాధించింది. రాజస్థాన్, కేరళ సెక్రటేరియట్ మధ్య మ్యాచ్‌లో రాజస్థాన్ సెక్రటేరియట్ 2-0 తేడాతో విజయం సాధించింది.





క్రీడాకారిణుల విజయోత్సాహం



శివయ్యా... స్వాగతమయ్యా

అనపర్తి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని అనపర్తిలోని శ్రీసత్య డ్రాయింగ్ అకాడమీ విద్యార్థి మందపల్లి శ్రీచరణ్ కుంచె నుంచి జాలువారిన శివుని చిత్రం ఆకట్టుకుంటోంది.



భక్తులకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపేందుకు రెండు రోజులు కష్టపడి కలర్ పెన్సిళ్లతో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు చరణ్ మీడియాకు తెలిపాడు.



సైకత శివం మహా సందేశం

'ఆది దంపతులు శివపార్వతుల అన్యోన్యం నేటి తరానికి ఆదర్శం' నినాదంతో తూర్పు గోదావరి జిల్లా రంగంపేటకు చెందిన ప్రముఖ సైకత శిల్పి దేవిన శ్రీనివాస్ సైకత శిల్పం రూపొందించారు. సంస్కృతి, సంప్రదాయలను కాపాడాలని కోరుతూ మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తీర్చిదిద్దిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది. శిల్పి శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

(ఆంధ్రజ్యోతి, రంగంపేట)

పొట్టలో పరమేశ్వరుడు



కాకినాడ సిటీ, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రామారావుపేటలోని ఆది గురు యోగా పీఠం వ్యవస్థాపకుడు, యోగా గురువు సద్గురు సచ్చిదానంద యోగి తన పొట్ట కండరాలను శివలింగం ఆకృతిలో మలిచి భక్తులను ఆబ్బురపరిచారు. యోగాలోని నౌలి క్రియ అనే భంగిమ ద్వారా భక్తిభావం చాటుకున్నారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో యోగా పీఠంలో సామూహిక మహా రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్టు సచ్చిదానంద చెప్పారు.

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

» రేపు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచార సమరం సాఫీగా ముగిసింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అటు టీడీపీ నేతలు, ఇటు మిగతా పక్షాల నేతలు పట్టభద్రులను కలిసి అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి నువ్వానేనా అన్నట్టుగా ప్రచారం పూర్తి చేయగలిగారు. ఇప్పటికే నిరుద్యోగం తాండ విస్తుండగా పట్టభద్రులను ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులంతా ప్రచారంలో చమటోడ్చారు. తమ కూటమి ప్రభుత్వం కారణంగానే పరిశ్రమలు రాబోతున్నాయని, మెగా డీఎస్సీతోపాటు యువతకు అనుకూలంగా ఉపాధి పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామనే హామీతో టీడీపీ బపలరిచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంచేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు స్వయంగా రెండు విడతలుగా ముఖ్య నేతలతో భేటీ నిర్వహించారు. యువనేత నారా లోకేశ్ కూడా ఎమ్మెల్సీ స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఏక పక్షంగా ఉండాలనే విధంగా ఉత్సాహపరిచారు. ఉమ్మడి ఉభయగోదావరిలో విభజిత ఆరు జిల్లాలు ఉండగా వీటన్నింటిలోనూ ప్రచారంలో తెలుగుదేశం పైచేయి సాధించగలిగింది. క్షేత్రస్థాయి కేడర్ దగ్గర నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్లు, మునిసిపల్ ఛైర్మన్‌లు, ఎంపీపీలు దగ్గర నుంచి పార్లమెంటు సభ్యుల వరకు పట్టభద్రుల చుట్టూ పరిభ్రమించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ఎక్కడా పట్టు జారకుండా పక్కాగా వ్యూహాత్మకంగానే ముందుకెళ్లారు. క్షేత్రస్థాయిలో ఉన్న పట్టభద్రులను కలిశారు. వీరంతా పోలింగ్ కేంద్రానికి వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రచారంలో పెద్దగా పార్టీల మధ్య వివాదాలు సృష్టించే వ్యాఖ్యలు చేయకుండా జాగ్రత్తలు పడ్డారు. కూటమి పక్ష ఎమ్మెల్యేలంతా తమ నియోజకవర్గాల్లో ఓటర్ల మద్దతుకు విశ్వప్రయత్నం చేశారు.

చూసి.. ఓటేయండి

పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులు పక్షాన వివిధ పార్టీల నేతలు ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి చాన్నాళ్లైనా ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవడంలేదంటూ పట్టభద్రులకు వివరించి వారి మద్దతు పొందేందుకు ప్రయత్నించారు. శాసనమండలిలో ప్రజల పక్షాన గొంతు వినిపించేలా తమకు ఓటు వేయాలని మిగతా అభ్యర్థులు ఎవరంతట వారుగా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించారు. మాజీ ఎంపీ హర్షకుమార్ సైతం వివిధ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ తన కుమారుడు జి.వి.సుందర్ పక్షాన ప్రచారం చేస్తూ టీడీపీపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. వైసీపీ మాత్రం లోతట్టుగా కూటమికి వ్యతిరేకంగా ఓట్లు వేయాల్సిందిగా తమ పార్టీ అనుకూల వర్గాలను ఇప్పటికే కోరింది. మండల స్థాయిలో కొందరు జోక్యం చేసుకుని ఈ విధంగా పరోక్ష ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉన్నా ప్రచార శైలిలో మాత్రం ఎవరంతట వారుగానే వ్యవహరించారు.

ఉద్యోగ వర్గాలు ఏ వైపు?

ఈసారి పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటర్లుగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఎవరైనా ఎన్నికల విధుల్లో ఉంటే వారికి పోస్టల్ ఓటుకు అవకాశం ఇస్తారు. మిగతా వారంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఇప్పటికే ఉద్యోగులంతా తమ పక్షానే ఉన్నారని కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల వరకు వెళ్లి తమ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఎలాగూ సిట్టింగ్ ఎమ్మెల్యేలంతా ఉభయగోదావరి జిల్లాల్లో కూటమి పక్షానికి చెందిన వారే కావడంతో ఉద్యోగులు కూడా ఎక్కడా వ్యతిరేకత ప్రదర్శించకుండా ఇప్పటిదాకా జాగ్రత్తపడ్డారు. కూటమి ఊహిస్తున్నట్టుగా వీరందరి మద్దతు ఆ వైపే దక్కితే భారీ మెజార్టీ తథ్యమని అంచనా వేస్తున్నారు. ఇంకో వైపు కార్మికులు, ఇతర వర్గాల్లో కూడా ఈ ఎన్నిక పట్ల పెద్దగా ఆసక్తి లేకపోయినా క్షేత్రస్థాయిలో నేతల హడావుడితో పోలింగ్ కేంద్రం వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

నంబర్-1 కోసమే ఆరాటం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యత ఓటు ఒకటిగా ఎవరికి అత్యధికంగా లభిస్తుందో వారే చివరికి విజేతలవుతారు. దీంతో గడిచిన మూడు రోజులుగా ప్రాధాన్యత ఓటు ఒకటి తమకే వేయాలని, బ్యాలెట్‌లో మరెవరికీ ఈ సంఖ్యతో ఓటు వేస్తే చెల్లకుండా పోతుందంటూ మరీ ఓటర్లను చైతన్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు వినియోగిస్తుండడంతో మొదటి ప్రాధాన్యత ఓటును ముందస్తుగా లెక్కిస్తారు. దీనిలో ఎవరైతే అత్యధికంగా ముందు వరుసలో ఉంటారో వారికే ఛాన్స్ దక్కడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే గడిచిన ఎన్నికల్లోను, అంతకు ముందు జరిగిన ఎన్నికల్లోను ప్రాధాన్యత ఓటు విషయంలో ఓటర్లు తడబడడంతో చెల్లని ఓట్లు వేల సంఖ్యలోనే నమోదయ్యాయి. ఒక్క 2019లో జరిగిన పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అప్పట్లో 13 వేలకుపైగా ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకరి కంటే మించి ఎవరికైనా నమోదు చేస్తే చెల్లదని అప్పట్లో చైతన్యపర్చకపోవడం వల్లే వేల ఓట్లు మురిగిపోయాయి. ఇప్పుడు తెలుగుదేశం దీనిని గమనించి తమ పార్టీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం పేరు బ్యాలెట్‌లో వరుస సంఖ్య ఒకటిలో ఉండడం, ఓటర్లు కూడా దీనికి అభిముఖంగా ఎన్నికల అధికారులు ఇచ్చిన పెన్నుతో ఒకటి (సంఖ్య రూపంలో) నమోదు చేస్తే చాలంటూ ఇప్పటికే ప్రచారంలో హోరెత్తించారు. మిగతా అభ్యర్థులు కూడా తమకు ప్రాధాన్యత ఓటు ఇవ్వాల్సిందిగా పదేపదే ఓటర్లను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించారు.

జిల్లాల వారీగా ఓటర్ల తుది జాబితా

జిల్లా	పోలింగ్ కేంద్రాలు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ట్రాన్స్ జెండర్	మొత్తం ఓటర్లు
అల్లూరి జిల్లా	12	2,842	1827	0	4669
కోనసీమ జిల్లా	95	37,114	27,355	2	64,471
తూ.గో. జిల్లా	92	36,361	26,606	3	62,970
ఏలూరు జిల్లా	66	24,704	17,571	7	42,282
కాకినాడ జిల్లా	98	42,463	28,072	5	70,504
ప.గో. జిల్లా	93	39,863	30,187	2	70,052
మొత్తం	456	1,83,347	1,31,618	19	3,14,984

రేపు పాఠశాలలకు సెలవు

ఏలూరు అర్బన్/భీమవరం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని ఉపాధ్యాయులందరూ ఓటు హక్కు వినియోగించుకు నేందుకు వీలుగా ఈ నెల 27న అన్ని పాఠశాలలకు ఎన్నికల సంఘం సెలవు ప్రకటించినట్టు అధికారులు తెలిపారు. అదే విధంగా 27న ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలకు ఏర్పాట్ల నిమిత్తం ముందు రోజు కూడా స్థానిక సెలవుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.

మద్యం విక్రయాలపై నిషేధం

కలెక్టరేట్ (కాకినాడ),ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు దృష్ట్యా పోలింగ్‌కు 48గంటల ముందు నుంచి మద్యం విక్రయాలపై నిషేధం విధించారని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు, ఈమేరకు ఒకప్రకటన విడుదల చేశారు. మంగళవారం 4గంటల నుంచి గురువారం సాయంత్రం 4గంటల వరకు మద్యం దుకాణాలు తెరకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మార్చి 3వ తేదీన మద్యం విక్రయాలపై నిషేధం విధించాలన్నారు. క్లబ్బులు, స్టార్ హోటల్స్ రెస్టారెంట్లు, హోటల్స్‌లో ఆయా తేదీల్లో మద్యం అమ్మకూడదని తెలిపారు.

స్వేచ్ఛగా ఓటెయ్యండి : ఆర్వో

ఏలూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని, పట్టుభద్రులంతా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సూచించారు. పోలింగ్ కేంద్రానికి తగిన గుర్తింపు పత్రంతో వెళ్లి అధికారులకు చూపించి ఓటెయ్యాలన్నారు. ఓటరు గుర్తింపు ఉన్న పత్రంపై ఓటరు పేరు వద్ద సంతకం చేస్తే అనంతరం బ్యాలెట్ పేపర్ అందిస్తారన్నారు. ఇందులో అభ్యర్థుల పేర్లు, ఫొటోలే ఉంటాయని, ప్రాధాన్యతా క్రమంలో అధికారులు ఇచ్చిన పెన్‌తో ఓటెయ్యాలన్నారు.

హెల్ప్‌లైన్ నంబర్లు

పట్టభద్రుల నియోజకవర్గంలోని ఓటర్ల సౌలభ్యం నిమిత్తం హెల్ప్‌లైన్ నంబర్ 1950 లేదా 94910 41419 నంబర్లను ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినట్టు రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్లను ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం ఓటర్లు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేటి నుంచి వాలీబాల్ టోర్నమెంటు

● ముస్తాబైన గొల్లవిల్లి క్రీడాప్రాంగణం ● ఫ్లడ్ లైట్లవెలుగుల్లో మ్యాచ్‌లు

● ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషులు, మూడు మహిళా టీమ్‌లు రాక



వాలీబాల్ పోటీలకు సిద్ధం చేసిన గొల్లవిల్లి క్రీడా మైదానం

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అరిగెల శ్రీరంగయ్య నేషనల్ వాలీబాల్ పోటీలకు కోనసీమ జిల్లాలోని గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణం ముస్తాబయ్యింది. ఈ నెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు టోర్నమెంటు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి. ఎనిమిది రాష్ట్రాల నుంచి ఆరు పురుషుల, మూడు మహిళా టీమ్‌లు పాల్గొననున్నాయి. 1988 నుంచి వాలీబాల్ పోటీల నిర్వహణలో అంచెలంచెలుగా ఎదిగిన గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా మైదానం జాతీయ, అంతర్జాతీయ ఆటగాళ్ల ప్రశంసలు అందుకుంది. ఆటగాళ్ల ప్రాక్టీసు నిమిత్తం ప్రత్యేక కోర్టును గతంలోనే ఏర్పాటు చేశారు. ఇప్పటికే గొల్లవిల్లి వాలీబాల్ కోర్టును రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ పరిశీలించడం జరిగింది. నాలుగు వేల మంది ప్రేక్షకులకు సరిపడే గ్యాలరీలు నిర్మించారు. మహిళలకు ప్రత్యేక గ్యాలరీ నిర్మించారు. వీఐపీలకు ప్రత్యేక వేదిక ఉంది. వాహనాలకు రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించారు. అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ రాజేష్ క్రీడా ప్రాంగణానికి రాకపోకలకు ప్రత్యేక మార్గాలను నిర్దేశిస్తూ రూట్ మ్యాప్ రూపొందించారు. క్రీడాప్రాంగణంలో శాంతిభద్రతల ఏర్పాట్లపై టోర్నమెంటు ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, సాంకేతిక సలహాదారు వుండ్రు రాజబాబుతో చర్చించారు.

యువత చెమటోడుస్తున్నారు

టోర్నమెంటు అధ్యక్షుడు, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ

గొల్లవిల్లి వాలీబాల్ క్రీడా వేదిక వెలుగులు నలుమూలలా ప్రసరింప చెయ్యాలన్న లక్ష్యంతో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సహకారంతో అరిగెల శ్రీరంగయ్య నేషనల్ టోర్నమెంటును ప్రారంభించాం. గొల్లవిల్లి వాలీబాల్ క్లబ్ యువతతో పాటు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి యువత ఈ టోర్నమెంటు నిర్వహణకు చెమటోడుస్తున్నారు.

తృతీయస్థానంలో గొల్లవిల్లి

గొలకోటి ఫణీంద్రకుమార్, పీడీ, టోర్నీ కార్యనిర్వాహక కార్యదర్శి

నేషనల్ వాలీబాల్ టోర్నమెంటు నిర్వహణలో గొల్లవిల్లి క్రీడా వేదిక ప్రస్తుతం దేశంలో మూడవ స్థానంలో ఉంది. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో గొల్లవిల్లి టోర్నమెంటు రిజిస్ట్రేషన్ జరిగింది. నాలుగు రోజుల పాటు జరిగే పోటీలు లీగ్ పద్ధతిలో జరుగుతాయి.

ప్రాణాలను బలిగొన్న అతివేగం

» ధవళేశ్వరంలో ఘోర రోడ్డు ప్రమాదం

» ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం



సంఘటనా స్థలం వద్ద మృతదేహాలు



ముత్యాలరావు (ఫైల్‌ఫొటో)



వెంకటేష్(ఫైల్)

ధవళేశ్వరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక జాలరుపేటకు చెందిన నాగమళ్ళ ముత్యాలరావు (19), బొడ్డు వెంకటేష్(17) స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం 4గంటల సమయంలో బైక్‌పై కాటన్ బ్యారేజ్ వైపు నుంచి వస్తూ బ్యారేజ్ సమీపంలో రాజోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయారు. అదే సమయంలో ఎదు రుగా ఆటో వస్తుండడంతో ఆటోను తప్పించడానికి సడన్ బ్రేక్ వేసిన వేయగా బస్సు వెనుక చక్రాల కిందకు పడిపోవడంతో బస్సు కుడివైపు వెనుక చక్రం ఇద్దరు తలల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై టైర్లను వేసి నిప్పు అంటించారు. సీఐ టి.గణేష్, ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నాగమళ్ల లక్ష్మణరావు, రాజేశ్వరి దంపతుల చిన్న కుమారుడు ముత్యాలరావు. 7వ తరగతి వరకు చదివి తండ్రికి చేపల వేటలో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఎదిగి వచ్చిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లాడంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కాగా వెంకటేష్‌కు తండ్రి వీరబాబు, ఓ అన్నయ్య, అక్క ఉన్నారు. తమ్ముడిని కోల్పోవడంతో వారి రోదన వర్ణనాతీతం. ఇద్దరు స్నేహితుల మృతితో జాలరిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి

ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ధవళేశ్వరం చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద మృతుల కుటుంబాలను పరామర్శించారు. వారిని ఓదార్చి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు.

వివాహిత అనుమానాస్పద మృతి



దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ అప్పలరాజు

ఎటపాక ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో వివాహిత మృతి చెందిన ఘటన మంగళవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం టీపీవీడు పంచాయతీలోని సీతాపురం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిప్రియ (27) ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. అప్పుడే ఇంటికి వచ్చిన భర్త నాగభూషణం భార్యని చూసి వెంటనే మెడకు ఉన్న ఉరితాడు తీసి కిందకు దింపాడు. ఇరుపొరుగు వారిని పిలిచేలోపు అప్పటికే ఆమె మృతిచెందింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ అప్పలరాజు సంఘటనా ప్రదేశానికి చేరుకుని దర్యాప్తు నిర్వహించారు. వివాహిత తల్లిదండ్రులు, భర్త, మామను విచారించారు. అయితే ఆమె మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యుల వేధింపులతోనే వివాహిత ఆత్మహత్యకు పాల్పడినట్టు జోరుగా ప్రచారం జరుగుతోంది. కాగా ఆరేళ్ల క్రితం సాయిప్రియకు వివాహమైంది. ఆమెది తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం. పోలీసులు పోస్టుమార్టం అనంతరం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ పేరుతో గర్భవతిని చేసిన వ్యక్తికి

పదేళ్ల జైలు శిక్ష, జరిమానా

అడ్డతీగల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో యువతిని నమ్మించి గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి పది సంవత్సరాలు జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించిన సంఘటన గంగవరం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. అడ్డతీగల సర్కిల్ పరిధిలోని గంగవరం మండలం పాత రాయవరం గ్రామానికి చెందిన గూడేం. రాయుడు అనే యువకుడు అదే గ్రామానికి చేందిన యువతిని ప్రలోభపెట్టి ప్రేమిస్తున్నానని నమ్మబలికి ఆమెను గర్భవతిని చేశాడు. వివాహం చేసుకోవాలని యువతి అనేక పర్యాయాలు ప్రాధేయపడిన ఫలితం లేకపోవడంతో గంగవరం పోలీస్‌స్టేషన్‌లో 2023లో ఫిర్యాదు చేసింది. దీనిపై అప్పట్లో కేసు నమోదు చేశారు. అప్పటి అడ్డతీగల సీఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తు అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని రాజమండ్రి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఆ కేసు మంగళవారం తుది విచారణకు రావడంతో నేరం రుజువు కావడంతో నిందితుడికి రాజమండ్రి 8వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య పదేళ్ల జైలు, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని అడ్డతీగల సీఐ నర్సింహమూర్తి తెలిపారు.

రాగిజావ తాగి..

14 మంది విద్యార్థులకు అస్వస్థత



అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఉప్పలగుప్తం/అమలాపురం టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చల్లపల్లి పంచాయతీ పరిధిలోని జగ్గరాజుపేట ప్రాథమిక పాఠశాలలో కలుషిత ఆహారం తిని 14 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు పులిదిండి సుజాత అందజేసిన రాగిజావను తాగిన విద్యార్థులు తొలుత స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. అనంతరం 12.10 గంటలకు మధ్యాహ్న భోజనంలో భాగంగా పులిహోర, దొండకాయ కూర కలిపి తిన్నారు. అప్పటికే రాగిజావ తాగిన 28 మంది విద్యార్థుల్లో 14 మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు. 5వ తరగతి చదువుతున్న మాదే అభిలాష్ వరుసగా 12 పర్యాయాలు వాంతులు చేసుకుని నీరసించి పోయాడు. పరిస్థితిని గుర్తించిన పాఠశాల హెచ్ఎం పి.వరలక్ష్మి అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితిని ఎస్.యానాం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి తెలియచేశారు. వెంటనే వైద్యాధికారిణి డాక్టర్ లోవసుధ అస్వస్థతకు గురైన విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి వారిని ఉన్నత వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, పీఎంసీ ఛైర్మన్ మార్కండేయులు దగ్గరుండి విద్యార్థులకు సేవలందించారు. అయితే విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తమకు ఎందుకు చెప్పలేదంటూ ఎంఈవో సత్తి సత్యకృష్ణ, తల్లిదండ్రులు హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వాహకురాలు రాగిజావ, పులిహోర, పచ్చడి తయారుచేసి పని ఉందని వెళ్లిపోయిన తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు.

ఏరియా ఆసుపత్రికి తరలింపు

సమాచారం ఇవ్వలేదని ఎంఈవో, తల్లిదండ్రుల ఆగ్రహం

విద్యార్థులకు వైద్య సేవలు

రాగిజావ తాగి అస్వస్థతకు గురైన విద్యార్థులను హుటాహుటీన అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో 2వ తరగతి చదువుతున్న నాతి దినేష్, దాసరి రోషన్‌తేజ్, మూడో తరగతి చదువుతున్న పోతుల అర్జున్, పెట్టా లక్కీ, బడుగు హారిక, మాదే నైనిష, మద్దెల ధనుష్, 4వ తరగతి చదువుతున్న పోతుల సుధాకర్, పోతుల సుహాసిని, మద్దెల రేణుక, 5వ తరగతి చదువుతున్న సాకా భార్గవకుమార్, మాదే దుర్గాశ్రీ, మాదే అభిలాష్, రొక్కాల నాగసత్యలకు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. సమాచారం అందుకున్న అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, ఆర్డీవో కె.మాధవి, తహశీల్దార్లు వాసా ఎస్.దివాకర్, పలివెల అశోక్‌ప్రసాద్ ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్న సమాచారంతో తల్లిదండ్రులతో పాటు బంధువర్గీయులు, స్థానికులు అధిక సంఖ్యలో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, బహుజన సమాజ్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు పరామర్శించారు.

ఆరోగ్యం మెరుగుపడింది : డీఈవో

అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని డీఈవో డాక్టర్ షేక్ సలీం బాషా తెలిపారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఇతర ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సాయంత్రానికి ఏడుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి పూర్తిగా మెరుగు పడడంతో డిశ్చార్జి చేశారు. మరో ఏడుగురు విద్యార్థులు వైద్యుల సంరక్షణలో చికిత్స పొందుతూ రాత్రికి డిశ్చార్జి చేయనున్నట్టు డాక్టర్ శంకరరావు తెలిపారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలిని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు తొలగించినట్టు డీఈవో తెలిపారు.



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి



శ్యామ్‌ప్రసాద్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, (అనకాపల్లి జిల్లా) ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు టోల్ ప్లాజా వద్ద వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన బి.శ్యామ్‌ప్రసాద్(28) నక్కపల్లి మండలం వేంపాడు వద్ద ఫ్యాబ్రికేషన్ పనులు చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడు ఎస్.సాయిబాబుతో కలిసి హెటిరో కంపెనీలో పనిచేస్తున్న మరో స్నేహితుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరారు. వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఓ లారీని తప్పించబోయి ఆగి ఉన్న మరో లారీని ఢీ కొన్నారు. దీంతో శ్యామ్‌ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, సాయిబాబుకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై నక్కపల్లి సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు సెలవు

ఆలమూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి జాతీయ రహదారిపై ఉన్న అంతర్ రాష్ట్ర కూరగాయల మార్కెట్‌కు ఈనెల 26న మహాశివరాత్రి సందర్భంగా సెలవు ప్రకటించారు. వ్యాపారులు, రైతులు గుర్తించి మార్కెట్‌కు కూరగాయలు తీసుకురావద్దని సూచించారు.

మారుతున్న రత్నగిరి రూపురేఖలు



మరుగుదొడ్లను శుభ్రపరుస్తున్న శానిటేషన్ సిబ్బంది

అన్నవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం ఆఖరిస్థానం రావడం పరిస్థితులు మెరుగు కోసం ప్రభుత్వ పెద్దల సూచనతో సోమవారం స్వీయపర్యవేక్షణ చేయడంతో క్రమేపీ రూపురేఖలు మారుతున్నాయి. ముందుగా గతకొంతకాలంగా నిరుపయోగంగా ఉన్న హరిహరసదన్ కాటేజీ పక్కనే ఉన్న మరుగుదొడ్లను శానిటేషన్ సిబ్బంది శుభ్రపరిచారు. సీఆర్వో కార్యాలయం వద్ద నగదురహిత సేవలను మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్నప్రసాదం స్వీకరించే భక్తులు వేచిఉండకుండా బఫే విధానం అమలుచేయాలనే కాకినాడ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఈవో వీర్ల సుబ్బారావు ప్రస్తుత భవన పైఅంతస్తు పరిశీలించి త్వరితగతిన అమలుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు సెక్యూరిటీ విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావు సెక్యూరిటీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ప్రోటోకాల్ పరిధిలో ఉన్నవారికి మాత్రమే ప్రత్యేక క్యూ ద్వారా పంపించాలని, కిందిస్థాయి సిబ్బందిఎవ్వరు తీసుకొచ్చిన తూర్పురాజగోపురం నుంచే పంపించాలని అడ్డదిడ్డంగా పంపకుండా చూడాలని ఆదేశించారు.

నేడు సరస్వతీ పూజ

త్వరలో జరిగే ఇంటర్, పదవ తరగతి, ఇతర ముఖ్య పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలనే ఆకాంక్షతో బుధవారం అన్నవరం దేవస్థానంలో సరస్వతీ పూజ నిర్వహించనున్నట్టు ఈవో వీర్ల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు నిత్య కల్యాణమండపంలో జరిగే ఈ కార్యక్రమంలో సరస్వతీపూజ అనంతరం స్వామిచెంతన ఉంచిన కలములు ఉచితంగా బహూకరించనున్నారు. అనంతరం వారికి సత్యదేవుడి ప్రత్యేకదర్శనం, అన్నదాన విభాగంలో ఉచిత అన్నప్రసాద సౌకర్యం కల్పించామని, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.



రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

'పేరాబత్తుల' గెలవడం ఖాయం

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):ఉభయ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలవడం ఖాయమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక జాంపేట కోఆపరేటివ్ బ్యాంక్, ప్రభుత్వ హోమియో కళాశాలలలో పట్టభద్రులైన ఓటర్లను ఆయన కలిసి నమూన బ్యాలెట్ పత్రాలను అందించి రాజశేఖరంను గెలిపించాలని కోరారు. పేరాబత్తుల పేరు ఎదురుగా నెంబరు-1 వేసి అఖండ మెజార్టీని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ స్థానిక సచివాయాల్లో పట్టభద్రులైన ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. రాజశేఖరంనకు మొదటి ప్రాధాన్య ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరంలో ప్రభుత్వ, ప్రవేట్ ఉపాధ్యాయులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ కలిసి కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంనకు తొలిప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కరపత్రాలు అందించారు.

మాదిగలు అండగా నిలబడాలి

మాదిగల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వానికి మాదిగలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుమర్తి చిన్నా మాదిగ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల మాదిగలు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. మాదిగలకు టీడీపీ హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమితి నాయకులు మద్దాల కొండలరావు, రాచర్ల మురళీ, శ్యామ్, కుమార్, అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులే లక్ష్యంగా కేంద్ర బడ్జెట్ : ఎంపీ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో మహిళలు, యువత, వ్యవసాయం, పెట్టుబడులు లక్ష్యంగా ఆయా రంగాలకు పెద్దపీట వేయడం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన బడ్జెట్ దేశవ్యాప్తంగా ఆమోదం పొందిందన్నారు. రాజమహేంద్రవరంలోని ఈఎస్ఐ, ప్రభుత్వ బోధనా సుపత్రుల్లో వైద్యులు, టెక్నికల్ స్టాఫ్ కొరత తీర్చడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సుమారు రూ.280 కోట్లతో రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పుష్కరాల నాటికి రాజమండ్రి ప్రధాన రైల్వేస్టేషన్‌తోపాటు కొవ్వూరు, గోదావరి రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. నిడదవోలు నుంచి యర్నగూడెం వరకూ రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. దివాన్‌చెరువు పై ఓవర్‌కు గ్రీన్ సిగ్నల్ లభించిందని తెలిపారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలు బేఖాతరు

- ఐదు రోజులుగా తెగని పంచాయితీ
- ఎల్ఎంసీ యూనియన్ కార్యాలయానికి తొలగించని తాళాలు
- ఆలిండియా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు నిరసన

అధికారులు స్పందించకపోతే రిలే దీక్షలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కాలంగా ఇరిగేషన్ కార్యాలయాల సముదాయం వద్ద షెడ్‌లో ఉంటున్న నాల్గో తరగతి ఉద్యోగుల యూనియన్ కార్యాలయానికి ఈ నెల 21న పోలవరం ఎల్ఎంసీ డివిజన్2 అధికారులు తాళంవేసి యూనియన్ బోర్డు తొలగించి ఈషెడ్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్టు నోటీసులు అంటించడం ఇరిగేషన్ వర్గాల్లో దుమారం రేపింది. యూనియన్ అఖిత భారత ఉపాధ్యక్షుడిగా ఉన్న వి.వెంకటేశ్వర్లు, స్థానిక యూనియన్ నాయకుల మధ్య ఉన్న విభేదాలతో నెంబర్-2 డివిజన్ అధికారులు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని తాళం వేశారు. ఆలిండియా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు యూనియన్ కార్యాలయానికి తాళం వేయడాన్ని ఖండిస్తూ పోలవరం చీఫ్ ఇంజనీర్‌తో పాటు ఎల్ఎంసీ ఎస్ఈ, డివిజన్-2 ఈఈకి లేఖ ద్వారా తెలియజేశారు. ఇదే విషయాన్ని కొందరు యూనియన్ నాయకులతో కలిసి మంత్రి కందుల దుర్గేష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి యూనియన్ కార్యాలయాన్ని అప్పగించాలని సూచించారు. యూనియన్ కార్యాలయంలో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇక మీదట అటువంటి కార్యక్రమాలు జరగనివ్వద్దని యూనియన్ నాయకులకు హితవు పలుకుతూ సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. దీంతో కథ సుఖాంతం అవుతుందని అందరూ భావించగా నేటి వరకు యూనియన్ కార్యాలయ తాళాలు తొలగించకపోవడంతో మంగళవారం ఆలిండియా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు కార్యాలయ సమీపంలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిరసన తెలిపారు. అధికారులు స్పందించకపోతే రిలే దీక్షలు చేపడతామన్నారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం


పుష్కరాలరేవును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి):పవిత్ర గోదావరి నదీ తీరంలో మహాశివరాత్రి పుణ్యస్నానాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.రాజమహేంద్రవరంలో పుష్కరాల రేవు, కోటిలింగాలరేవు, చింతాలమ్మఘాట్, టీటీ డీ ఘాట్, గౌతమి ఘాట్, సరస్వతి ఘాట్‌లలో భక్తులు బుధవారం తెల్లవారుజాము నుంచే స్నానాలు చేసేందుకు అవసరమైన సదుపాయాలు సిద్ధం చేశారు. రేవులో గోదావరి లోతును బట్టి సరిహద్దులు ఏర్పాటు చేసి నావలను పెట్టి గజ ఈతగాళ్లను నియమించారు. రేవుకు నావకు మధ్యలో ఉన్న గోదావరి నీటిలో స్నానాలు చేసేలా ఏర్పాట్లు చేశారు. అలాగే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, రేవుల్లో తాగునీటి కేంద్రాలు, వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతి ఘాట్‌లో ఎప్పటికప్పుడు అపారిశుధ్యాన్ని శుభ్రం చేసేందుకు, స్నానాలు చేసిన భక్తులు వెంటనే రేవు వెలుపలకు వచ్చి ఆలయాల్లో దర్శనాలు చేసుకుని బయటకు వెళ్లిపోయే విధంగా ఏర్పాట్లు చేశారు. రేవుల్లో పరిస్థితులను డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. 400 మంది పారిశుధ్య కార్మికులతో రేవుల్లో పనులు నిర్వహిస్తున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చూడండి:

మహాశివరాత్రి పుణ్యస్నానాలు ఆచరించేందుకు రాజమహేంద్రవరం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. పుష్కరాలరేవు, మార్కండేయ ఘాట్, చింతాలమ్మ ఘాట్, కోటిలింగాల ఘాట్లను మంగళవారం పరిశీలించారు. కార్పొరేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు రేవులను శుభ్రం చేసేవిధంగా శానిటేషన్ నిర్వహణ ఉండాలన్నారు. మహిళలు, దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందిలేకుండా తాత్కాలిక గదులు ఉండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా గజ ఈతగాళ్ళను ఉంచాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, కాశి నవీన్‌కుమార్, రెడ్డి మణేశ్వరరావు, యిన్నమూరి దీపు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు సహకరించాలి: డీఎస్పీ

కడియం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు, పోలీసుశాఖకు భక్తులు సహకరించాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. మంగళవారం కడియం పోలీసుస్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ మండలంలో ఆయా గ్రామాల్లో శివాలయాల వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీలు చర్యలు తీసుకోవాలన్నారు. కడియపులంక అభయాంజనేయస్వామి ఆలయ 75వ వార్షికోత్సవం సందర్భంగా భారీ ఎత్తున భక్తులు వచ్చే నేపథ్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పీఎంపీలకు వ్యాధులపై అవగాహన

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): పీఎంపీ అసోసియేషన్ సభ్యులకు జేఎన్ రోడ్డులోని మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ బి.హిమజరెడ్డి మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, హెచ్ఐవీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రికి ఘన నివాళి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల హృదయాలకు హత్తుకునేలా తెలుగు కథలు రాసి.. తెలుగు కవిగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఘనత వహించారని ఆంధ్రకేసరి యువజన సమితి ఫ్రీడం ఫైటర్ పార్క్ కన్వీనర్ మాదిరా శ్రీనివాస్ అన్నారు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 65వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కోటిపల్లి బస్టాండ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు దేశిరెడ్డి బలరామనాయుడు, రఘుపాత్రుని సాయిబాబా, దూర్వాసుల సత్యనారాయణ, గుడిపూడి సునీల్ గౌతమ్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ

కడియం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకుని కార్డులు పొందడం ద్వారా ప్రమాదం సంభవించినపుడు ఆర్థిక సాయం పొందే అవకాశం ఉందని ఎంఈవోలు ఎంఎస్ మణికుమార్, వై.నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరి ఎంపీపీ పాఠశాల-1లో ఆయా, మధ్యాహ్న భోజనవర్కర్లకు కార్డులు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.జయరాజు, సర్వశిక్ష ఇంజనీర్ కె.వీరభద్రరావు, పేరెంట్స్‌కమిటీ చైర్మన్ డి.సాయికృష్ణ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సరీ సంఘం ప్రమాణ స్వీకారానికి విచ్చేయండి

కడియం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మార్చి 2న జరగబోయే నర్సరీ సంఘం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విచ్చేయండి అంటూ సంఘం అధ్యక్షుడు రత్నం అయ్యప్ప, డైరెక్టర్లు.. మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, దుర్గేష్‌లను కోరారు. ఈ మేరకు వారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ భవనంలో నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ మెనేజ్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, గొట్టిముక్కల అనంతరావు, డాక్టర్ రమణలు పాల్గొని ట్రైనింగ్ పొందిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

పరంపర పేరుతో మోసగించారు

పేపరుమిల్లు కార్మికుల ధర్నా


పేపరుమిల్లు వద్ద ధర్నా చేస్తున్న పరంపర కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పేపరుమిల్లులో పరంపర నియామకాల పేరుతో ఉద్యోగాలు పొందిన తమను కార్మిక నాయకుడు చిట్టూరి ప్రవీణ్‌చౌదరి, మాజీ ఎంపీ భరత్ రామ్, మిల్లు యాజమాన్యం కలిసి మోసం చేశాయని బాధిత కార్మికులు ధర్నా చేశారు. పేపరుమిల్లు గేటు వద్ద మంగళవారం బాధిత కార్మికుడు కల్యాణ్ మాట్లాడారు. పరంపరలో భాగంగా నియామకాలు చేసినప్పుడు ట్రైనింగ్‌లో నెలకు రూ.13 వేలు ఇస్తారని ఆటుపై నెలకు రూ.29వేలు జీతం అని చెప్పారని అయితే ట్రైనింగ్ సమయంలో నెలకు రూ.8 వేలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. ట్రైనింగ్ పూర్తయ్యాక నెలకు రూ.18 వేలు ఇస్తున్నారన్నారు. దీనిపై యాజమాన్యాన్ని నిలదీస్తే మీ యూనియన్ నాయకుడు ప్రవీణ్ చౌదరికి అంతా తెలుసని చెప్పారన్నారు. ఈ చీకటి ఒప్పందంతో కార్మికలను ప్రవీణ్ చౌదరి మోసం చేశాడని ధ్వజమెత్తారు. పరంపర పేరుతో ప్రవీణ్ చౌదరి బయట ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల పైబడి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇప్పుడు నిలదీస్తే తాను ఆ డబ్బును మిల్లు అధికారి ముఖేష్ జైన్, మాజీ ఎంపి భరత్‌రామ్‌కు ఇచ్చారని చెబుతున్నాడని, తమకు అన్యాయం చేశారని ధ్వజమెత్తారు. గతంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హెచ్చరించినా ఆయన మాటలు పెడచెవిన పెట్టినందుకు ఇప్పుడు బాధపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే వాసు న్యాయం చేస్తారని ఆశతో ఉన్నామన్నారు. కార్మికుడు జోగారావు మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశా మన్నారు. ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ధర్నాలో సుమారు 111 మంది బాధిత కార్మికులు పాల్గొన్నారు.

'జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వొచ్చు'

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో 11 సీట్లు వచ్చిన జగన్ ప్రతిపక్ష హోదాకు అర్హుడు కాదని అనడం సరికాదని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. స్థానిక రాజీవ్‌గాంధీ కాలేజీ లో మంగళవారం జరిగి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత యేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌కు వచ్చిన ఓటింగ్ శాతానికి కూటమి ప్రభుత్వానికి వచ్చిన ఓటింగ్ శాతానికి పెద్దగా వ్యత్యాసం లేదన్నారు. 16శాతం ఓట్లు కూటమి ప్రభుత్వానికి వచ్చాయన్నారు. అందువల్ల జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వవచ్చని హర్షకుమార్ పేర్కొన్నారు.

డ్రైవర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలి : నన్నయ వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్లు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, బస్సులను పూర్తి కండిషన్‌లో నడపాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని వసతులను మంగళవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులను, సిబ్బందిని విశ్వవిద్యాలయానికి తీసుకువచ్చే బస్సుల రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డ్రైవర్లు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే విశ్వవిద్యాలయం బాలుర వసతిగృహం సందర్శించి విద్యార్థులతో కలసి టిఫిన్ చేశారు. కాంపస్‌లోని బేకరీ, క్యాంటీన్‌లను సందర్శించి విద్యార్థులకు నాణ్యమైన ఆహారపదార్థాలు అందించాలని చెప్పారు. విశ్వవిద్యాలయం భద్రతా బాధ్యతలు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులకు పలు సూచనలు చేశారు.

వైభవంగా పాండురంగ స్వామి కల్యాణం

కోరుకొండ, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ రావిచెట్టు కింద వెలిసిన శ్రీ రుక్మిణి సమేత శ్రీపాండురంగస్వామి వారి 14వ వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అన్న సమారాధనలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం పాండురంగ స్వామిని దర్శించుకున్న కంబాల శ్రీనివాసరావు,అన్న సమారాధన కార్యక్రమానికి లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం కణుపూరులో జరిగే భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి వారి 63వ వార్షిక శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

నేటి నుంచి కణుపూరు తీర్థం ప్రారంభం

కోరుకొండ మండలం కణుపూరు భ్రమరాంబిక సమేత స్వయంభు పంచముఖ జ్యోతిస్వరూప మల్లికార్జునస్వామి వారి 63వ వార్షిక కల్యాణ మహోత్సవాలు, శివరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమై 5రోజులుగా వైభవంగా జరుగనున్నాయి. ఈ సందర్భంగా స్వామి వారి కొండపైన, కొండదిగువున భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ విస్తృత ఏర్పాట్లు చేసింది. స్వామి వారి కొండపై మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మహా కుంభాభిషేకం, కోటి బిల్వార్చన జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు.

సీలింగ్ భూముల పట్టాల కోసం ధర్నా

గోకవరం, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): గత ఇరవై ఏళ్లుగా సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని శివరామపట్నం గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, పట్టాలు మంజూరు చేయాలని ఆందోళనకారులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.రమేష్, కడితే సతీష్, డి.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కోత దశలో సన్న రకాలు

రాజానగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సీజన్‌లో సన్న రకాలు వరి పంట మరో 20 నుంచి 25 రోజుల్లో కోత దశకు చేరుకుంటాయని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం పేర్కొన్నారు. మండలంలోని వెలుగుబందలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో వరి పంటకు చీడపీడలు తక్కువగా ఆశించాయన్నారు. గ్రామ వ్యవసాయాధికారులు శిరీష, మనస్వి, రైతులు పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లదే కీలకపాత్ర

రాజానగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకపాత్ర పోషిస్తారని మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు అన్నారు. జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లకు రాజానగరం హైస్కూల్లో గత ఆరు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాలతో గిడియాన

అంతరాష్ట్ర యూత్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాంలో గైట్ ఫార్మసీ వలంటీర్

రాజానగరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలో నిర్వహిం చిన అంతర్ రాష్ట్ర యూత్ ఎక్స్ఛేంజి కార్యక్ర మంలో తమ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ కె.షకీనా గిడియాన పాల్గొన్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు మం గళవారం తెలిపారు. ఏపీ తర పున వివిధ జిల్లాలకు చెందిన 28 మంది పాల్గొనగా వీరిలో తమ కళాశాలలోని ఎన్ ఎస్ఎస్ వలంటీర్ కె.షకీనా గిడియాన పాల్గొన్నారన్నారు. కేరళ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్ ప్రొఫెసర్ రాధాకృష్ణ ప్రశంసా పత్రం అందించారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ మీరా,అధ్యాపకులు తదితరులు అభినందించారు.


నన్నయలో ఓటర్లకు నమూనా బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్న రుడా చైర్మన్ జీవీఆర్ చౌదరి


రంగంపేటలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కూటమి అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి

● ఓటర్లను అభ్యర్థించిన రుడా చైర్మన్ జీవీఆర్ చౌదరి, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీచేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి విజ్ఞప్తి చేశారు. ఆదికవినన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులను, బోధనేతర సిబ్బందిని కలిసి వారికి బ్యాలెట్ నమూనాలను ఇచ్చి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయన వెంట రాష్ట్రయాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తులనాగు, టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాసరావు, గంగిశెట్టిచంటిబాబు, తనకాలనాగేశ్వరరావు, కొణతం నరసింహారావు, రాయుడు శ్రీనివాస్, బచ్చుప్రసాద్, నూనెవెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి బలం పెంచి సహకరించండి

అనపర్తి: అసెంబ్లీ ఎన్నికలలో కూటమికి భారీ మెజారిటీ అందించినట్లుగానే శాసన మండలిలలో కూటమికి బలాన్ని పెంచి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి చింతల రామకృష్ణ కోరారు. మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అనపర్తిలోని జీబీఆర్ కళాశాల, సాయి మాధవి డిగ్రీ కళాశాల, ఎంఎన్ఆర్ జూనియర్ కళాశాలల్లో పర్యటించి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరారు. ముందుగా జీబీఆర్ కళాశాల ప్రిన్సిపల్ పెద అబ్బాయి రెడ్డి, వీఆర్ఎల్ స్వామి, సాయి మాధవి డిగ్రీ కళాశాల చైర్మన్ మల్లిడి అనంతరెడ్డి, ఎంఎన్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తాడి సతీష్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, కర్రి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: ఉమ్మడి తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం రంగంపేట మండలంలో గల రంగంపేట శ్రీఉండవిల్లి సత్యనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను కలిశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్, రంగంపేట, సింగంపల్లి గ్రామాల ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి కూటమి బలపర్చిన ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. బిక్కవోలులోని శ్రీప్రజ్ఞా కళాశాలలో ఆయన మంగళవారం పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈయన వెంట ఎన్నికల పరిశీలకులు చింతల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ అధ్యక్షుడు పల్లి వాసు, ఇందల వీరబాబు, సర్పంచ్ సరెళ్ల సుమలత పాల్గొన్నారు. ఊలపల్లిలో పీహెచ్‌సీ మాజీ అధ్యక్షుడు తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి పేరాబత్తులను గెలిపించాలని పట్టభద్రులను కోరారు.

ఆభరణాల అపహరణ

రాజానగరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమూరులోని రాజరాజేశ్వరినగర్‌కు చెందిన ఏలూరి సూర్యప్రకాష్‌రాజు కుటుంబ సమేతంగా ప్రయోగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉండడం గమనించి, ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో భద్రపర్చిన 10 గ్రాముల బంగారు చెవి దుద్దులతో పాటుగా టీవీ చోరీకి గురైనట్లు గుర్తించారు. రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్.ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఊలపల్లిలో మెగా యూరాలజీ క్యాంప్

బిక్కవోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఊలపల్లిలో మంగళవారం మౌర్య ఆసుపత్రి వారి సౌజన్యంతో మెగా ఉచిత యూరాలజీ వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా శిబిరాన్ని బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో డాక్టర్ మౌళి వంద మందికి పరీక్షలుచేసి 15 మందికి ఆపరేషన్లు అవసరమవుతాయని వారిని కాకినాడ తీసుకువెళ్లారు. మిగిలిన వారికి వారం రోజుల పాటు సరిపడా మందులు అందజేశారు.

ఆరోగ్యంగా జీడిమామిడి తోటలు

● జిల్లా ఏరువాక కేంద్రం ప్రధానశాస్త్రవేత్త నరసింహారావు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో సాగుబడిలో నున్న జీడిమామిడితోటలు ఆరోగ్యంగానే ఉన్నాయనీ, పూత పిందెదశలో ఉన్నాయని కొన్ని సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన అధికదిగుబడులు సాధించవచ్చునని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. రాజానగరం మండలంలోని శ్రీకృష్ణపట్నంలో స్థానిక రైతు దొడ్డా అర్జునరావు తోటలోమంగళవారం క్షేత్రసందర్శన చేశారు. ఈసందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈఏడాది చీడపీడలు తక్కువ స్థాయిలో ఉన్నాయని చెప్పారు. జీడిపిక్కల దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కొన్ని ప్రాంతాలలో తోటలకు టీదోమ ఆశించి చివుళ్ళుఊదా రంగుకి మారి మాడిపోతున్నాయన్నారు. ఆకులకు బూడిదతెగులు, ఆంత్రక్నోజ్ వంటి తెగుళ్లు ఆశించాయన్నారు. జీడి మామిడిలో టీదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మీ.లీ/ లీనీటికి కలిపి కొత్తచిగురు సమయంలో మొదటిపిచికారీ చేయాలని సూచించారు. పూతవచ్చిన తరువాత క్లోరిపైరిఫాస్ 2.5 మీలీ/నీటికి కలిపి రెండవసారి పిచికారీ చేయాలన్నారు. గింజబఠానీ పరిమాణంలో ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్2.0 మి.లీ/లీ నీటికి కలిపి మూడవ సారి పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు దొడ్డా అర్జునరావు, కుట్టే రాంబాబు, బుడ్డిగ అర్జునరావు పాల్గొన్నారు.


'భక్తులకు స్వామి దర్శనాలు కల్పించాలి'

బిక్కవోలు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి రోజున వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్వామి దర్శనాలు కల్పించాలని జిల్లా దేవదాయశాఖాధికారి కె.నాగేశ్వరరావు సూచించారు. సోమవారం రాత్రి ఆయన బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈయన వెంట ఆలయ ఈవో ఆకెళ్ల భా స్కర్, ఆలయ అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యశర్మ, కొడమంచిలి సత్యనారాయణశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.





మహా.. శివుడు




మండపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివుడు మన చెంత కొచ్చాడు.. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో కొలువయ్యాడు.. దేశంలో ఆదియోగి భారీ విగ్రహాలు కోయంబత్తూరు, బెంగళూరుల్లో 112 అడుగులు చొప్పున రెండు ఉన్నాయి. ద్వారపూడిలో మూడోది కొలువుదీరింది. 60 అడుగుల ఎత్తు, 100 అడుగులు వెడల్పుతో నిర్మించిన ఈ విగ్రహాన్ని మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఉదయం 5.30 గంటలకు ఆవిష్కరించనున్నారు. తమిళనాడుకు చెందిన ఎస్ఎల్ కనకరాజు చాలా ఏళ్ల కిందట ద్వారపూడి వచ్చి అయ్యప్ప ఆలయాన్ని నిర్మించారు. ఆయన ఇటీవల బెంగళూరులోని తన కుమారుడి వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఆదియోగి విగ్రహాన్ని దర్శించుకున్నారు. ద్వారపూడిలో కూడా ఇలాంటి విగ్రహం ఏర్పాటు చేయాలని బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన శిల్పి పడాల పెదరాఘవను సంప్రదించారు. పది నెలల్లో రూ.30 లక్షలు ఖర్చుచేసి విగ్రహాన్ని ఇలా తయారు చేశారు. విగ్రహం వెనుక భాగం లోపల శివలింగంతోపాటు 40 మంది వరకు కూర్చుని ధ్యానం చేసుకునేలా ఏర్పాటు చేశారు. విగ్రహం ముందు వినాయకుడు, కుమారస్వామి, నాలుగు వైపులా వశిష్ఠ, అత్రి, గౌతమ, కశ్యప, జమదగ్ని, విశ్వామిత్ర, వాల్మీకి విగ్రహాలు ఏర్పాటు చేశారు.

శివరాత్రికి ముస్తాబు




శివరాత్రి వెలుగులు : విద్యుత్ ధగధగల మధ్య పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం

ముస్తాబైన ధవళేశ్వరం అగస్త్యేశ్వరుడు



తీపర్రులో శివయ్య



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లు

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.. గోదావరి రేవులు సిద్ధమయ్యాయి..ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళా నేపథ్యంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రాధాన్యం పెరిగింది..ఉభయగోదావరి జిల్లాలో పలు ప్రధాన ఆలయాలు ఉన్నాయి.. ఆయా ఆలయాలకు భక్తజనం పోటెత్తుతారు. రాజమహేంద్రవరం, కొవ్వూరులో అఖండ గోదావరికి భక్తజనం తండోపతండాలుగా తరలివస్తారు.. ఈ సందర్భంగా ఆలయాలు.. గోదావరి రేవుల వద్ద పోలీస్ బందోబస్తు మధ్య ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. - లోపల పేజీల్లో

ప్రచారం ముగిసింది.. ఓటు మిగిలింది!

రేపే ఎమ్మెల్సీ పోలింగ్

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మంగళవారంతో ముగిసింది. గురువారం పోలింగ్ జరగనుంది. తూర్పుగోదావరి జిల్లాలో 62,970 మంది ఓటర్లకు 92 పోలింగ్ కేంద్రాలు, కోనసీమ జిల్లాలో 64,471 మంది ఓటర్లకు 95 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 70,504 మంది ఓటర్లకు 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బుధవారం అధికారులకు బ్యాలెట్ పత్రాలు పంపిణీ చేయనున్నారు. బరిలో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీపడతారు. హోరాహోరీగా సాగిన ప్రచారంలో అభ్యర్థులంతా ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నించారు. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రచారంలో ఎక్కడా చిన్నపాటి వివాదాలు తలెత్తలేదు. ప్రచారం ప్రశాంతంగా ముగిసింది. 7



మల్కిపురం మండలం గూడపల్లిలో ఓటు అభ్యర్థిస్తున్న కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం. చిత్రంలో ఎమ్మెల్యే దేవవరప్రసాద్

నిషేధిత మాదకద్రవ్యాలపై అవగాహన పెంచాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి నార్కో సమన్వయ సెంటర్ (ఎన్‌సీవోఆర్‌డీ) సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది 2,700 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 900 మంది వరకూ మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారని తెలిపారు. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లపై నిఘా పెట్టి అరికట్టామన్నారు. ఇప్పటి వరకూ 140 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు. వీళ్లు దగ్గు మందు ఎక్కువ మోతాదులో తాగిన మత్తులో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నట్టు గుర్తించామన్నారు. విశాఖ డివిజన్ ఎన్‌సీబీ బృందం సభ్యులు అభిజిత్, రోహన్, డి.నాగమణి, డీఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల అరెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):సింహాచలనగర్‌లోని క్వారీ గోతుల ప్రాంతంలో గంజాయి నిల్వ చేస్తున్నారనే సమాచారంతో త్రీటౌన్ పోలీసులు సోదాలు చేశారు.క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన మేకల గణేశ్,ఆవుల అభి,సీటీఆర్ఐకి చెందిన ఉగ్గిన దుర్గాప్రసాద్,తాడికొండ శామ్యూల్ ప్రతాప్, తొండా పోతురాజు(గోకవరం)ను అరెస్ట్ చేసి 20.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్య

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒకరు ఆర్థిక ఇబ్బందులు.. మరొకరు అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఆదెమ్మ దిబ్బ ప్రాంతంలోని వాంబే కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్న ఆటో డ్రైవరు కరణం రాము (30) ఆర్థిక ఇబ్బందుల కారణంగా మంగళవారం ఉదయం ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు.జేఎన్ రోడ్‌లో నివా సం ఉంటున్న ఆళ్ల సంతోశ్(40) అనారోగ్యం కారణంగా సోమవారంపురుగుల మందు తాగాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 92 పోలింగ్ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్న నేపథ్యంలో జిల్లాలోని 92 పోలింగ్ కేంద్రాలకు, 15 రూట్ల ద్వారా బుధవారం పోలింగ్ మెటీరియల్ పంపిస్తామని కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. ఆర్ట్స్ కాలేజి ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు 400 మంది పోలీసులను నియమించామన్నారు. పోలింగ్ సందర్భంగా గురువారం అన్ని పాఠశాలలకు పాఠశాల విద్యా కమిషనర్ సెలవు ప్రకటించడం జరిగిందని డీఈవో కె.వాసుదేవరావు తెలిపారు.ఆమె వెంట సహాయ రిటర్నింగ్ అధికారి టి.సీతారామ్మూర్తి, ఆర్డీవో కృష్ణ నాయక్ ఉన్నారు.

స్నేహితుల దుర్మరణం
8 ఇద్దరి ప్రాణాలు తీసిన అతివేగం

జీవ ఎరువుల తయారీపై శిక్షణ



జీవ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కొవ్వూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రసాయణ, పురుగుల మందుల్లేని ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రతి రైతు అవలంభించాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లు, తాళ్లపూడి, నల్లజర్ల, గోపాలపురం మండలాలకు చెందిన 110 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంలో జీవ ఎరువుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను, జీవ ఎరువుల తయారీని వివరించారు. జీవ ఎరువులు మొక్కలకు పోషకాలను గ్రహించడంలో సహాయపడతాయన్నారు. రానున్న ఖరీఫ్ పంటలకు ముందు వేసుకోవలిసిన పచ్చిరొట్ట పంటలపై అవగాహన కల్పించారు. ద్వారకా తిరుమలకు చెందిన ఆదర్శ రైతు గోపాలకృష్ణ కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ డిస్ట్రిక్ ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు, ఏడీపీఎం మహమ్మద్ వలీ, రైతులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ప్రొడక్షన్
మేనేజర్‌గా శ్రీనివాసరావు



మేనేజర్‌ను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

దేవరపల్లి, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన గారపాటి సుబ్బారావును దేవరపల్లి పొగాకుబోర్డు రైతు సంఘం అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాసరావు మంగళవారం గుంటూరులోని పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో ఫీల్డ్ ఆఫీసర్‌గా పని చేసిన సుబ్బారావు అంచెలంచెలుగా ఎదిగి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి పొగాకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్‌గా నియమితులవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు సింహాద్రి ధర్మవతారం తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలను బలిగొన్న అతివేగం

ధవళేశ్వరంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు స్నేహితుల దుర్మరణం



ధవళేశ్వరం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. ధవళేశ్వరంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక జాలరుపేటకు చెందిన నాగమళ్ళ ముత్యాలరావు(19), బొడ్డు వెంకటేష్(17) స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం 4గంటల సమయంలో బైక్‌పై కాటన్ బ్యారేజ్ వైపు నుంచి వస్తూ బ్యారేజ్ సమీపంలో రాజోలు నుంచి రాజమహేంద్రవర వెళుతున్న ఆర్టీసీ బస్సును ఓవర్ టెక్ చేయబోయారు. అయితే అదే సమయంలో ఎదురుగా ఆటో వస్తుండడంతో ఆటోను తప్పించడానికి సడన్ బ్రేక్ వేసిన సమయంలో బస్సు వెనుక చక్రాల కిందకు పడిపోవడంతో బస్సు కుడివైపు వెనుక చక్రం ఇద్దరి తలల పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. రోడ్డుపై టైర్లను వేసి నిప్పు అంటించారు. సీఐ టి.గణేష్, ఎస్ఐలు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించారు. అప్పటికే నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టంకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హర..హర



కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత



గోష్పదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు

- మహా శివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు
- ఆలయాల వద్ద చలువ పందిళ్లు
- నేటి తెల్లవారుజాము నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు

పెరవలి/గోపాలపురం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా పలు గ్రామాల్లో శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టూ తోరణాలు కట్టి రంగులతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల వద్ద తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. పెరవలి మండలం కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, కొత్తపల్లి, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పిట్టలవేమవరం, గోపాలపురం మండలం చెరుకుమిల్లి, హుకుంపేట, దొండపూడి, జగన్నాథపురం, గోపాలపురం తదితర గ్రామాల్లోని శివాలయాల వద్ద పందిర్లు వేసి అలంకరించారు. తీపర్రులో రాజ రాజ నరేంద్రస్వామి, శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. సుమారు 30 గ్రామాల భక్తులు వస్తారు. ఈ సందర్భంగా శివాలయ ప్రాంగణాన్ని తాటాకు పందిర్లతో అలంకరించారు. భక్తులకు కుందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చే స్తున్నారు. అలాగే శివరాత్రి ఉత్సవాలకు కూటమి నాయకులు కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, పత్తిపాటి ప్రసాద్‌కుమార్, ఆలయ ఈవో రామయ్య తదితరాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం వీరభద్రుల సంబరం, మధ్యాహ్నం రథోత్సవం, రాత్రి ప్రబల సంబరం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

నిడదవోలు: నిడదవోలులో అతి పురాతనమైన, ప్రాచీన చరిత్ర కలిగిన శివాలయ మైన రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున నుంచే విశేష అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు.

నల్లజర్ల: మండలంలోని పోతవరం శివాలయంలో ఆలయ ధర్మకర్త పాపా వాసు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఘంటావారిగూడెంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ ఆధ్వర్యం లో వేడుకలు జరుగనున్నాయి. అనంతపల్లి, గుండేపల్లి, నల్లజర్ల గ్రామాల్లోని ఆలయాల్లో శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు.

దేవరపల్లి: మండలంలోని పల్లంట్ల గ్రామం లో రాజరాజేశ్వరి సమేత దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వేద పండితులు స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ముందుగా శ్రీసద్గురు గీతాకృష్ణ ఆశ్రమం శ్రీకృష్ణనందగిరి మాతాజీ ప్రవచన కార్యక్రమం జరిగింది. దేవరపల్లికి చెందిన కొండపు లక్ష్మణరావు శివుడి వేషధారణలో నృత్యప్రదర్శన చేశారు. కల్యాణాన్ని కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మితతోపాటు అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తీపర్రులో రాజరాజ నరేంద్రుడి శివలింగం



నిడదవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు

గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లు పూర్తి: ఆర్డీవో

కొవ్వూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆర్డీవో రాణి సుస్మిత తెలిపారు. మంగళవారం గోష్పాదక్షేత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. అలాగే ప్రాథమిక చికిత్సా కేంద్రా న్ని పరిశీలించి సూచనలు చేశా రు. అగ్నిమాపక శాఖా సిబ్బంది ఫైర్‌ఇంజన్ సహాయంతో స్నానఘట్టాలను శుభ్రపరిచారు. సుందరేశ్వరస్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చే భక్తులు తొక్కిసలాట లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వేకువజాము నుంచి శివుడికి రుద్ర, పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయార్చకులు తెలిపారు. క్షేత్రంలోని కాశీవిశ్వేరుడి వద్ద రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. స్నానాల సమయంలో భక్తులకు ప్రమాదాలు జరగకుండా నదిలో గజ ఈత గాళ్లను, పడవలను మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏరాటుచేశారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులతో పాటు స్నానఘట్టాల్లో క్లోరినేషన్ చేశారు. క్షేత్రంలో విద్యుత్ దీపాలను ఏర్పాటుచేశారు. భక్తులకు తాగునీరు, వృద్ధులు, చిన్నారుల సౌకర్యార్థం జల్లు స్నానం ఏర్పాటు చేసినట్టు కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. ఏఎస్పీ ఎల్.అర్జున్ ఆధ్వర్యంలో పోలీసులకు షిఫ్టులు వారీగా విధులు కేటాయించారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.సంధ్య, డాక్టర్ ఎస్.ధర్మరాజు, ఎలక్ట్రికల్ ఏఈ డి.జగదీశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు. గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నిర్దేశించిన స్నానఘట్టాల్లో మాత్రమే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించాలన్నారు. ప్రసాదాల పంపిణీకి స్వచ్ఛంద సంస్థలు, దాతలు ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, గొర్రెల శ్రీధర్, పిల్లలమర్రి మురళీకృష్ణ, పెనుమాక జయరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.



గోష్పాదక్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

'పేరాబత్తుల'ను గెలిపించండి



దేవరపల్లిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

- ఎమ్మెల్యేలు మద్దిపాటి, ముప్పిడి
- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

దేవరపల్లి/గోపాలపురం/నల్లజర్ల, ఫిబ్రవరి25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ఎంతో విలువైందని, ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మంగళవారం ఆయన దేవరపల్లిలోని టీహెచ్‌ఎస్‌ఆర్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాల, ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాల, గోపాలపురం మండలం జగన్నాథపురం, నల్లజర్లలోని భాష్యం స్కూల్, ఏకేఆర్‌జీ కళాశాలలో పట్టభద్రులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్‌డీఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయని రాజశేఖర్‌ను గెలిపిస్తే శాసన మండలిలో తన గళాన్ని వినిపిస్తారన్నారు. పట్టభద్రులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందన్నారు. జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు మాట్లాడుతూ రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు మాట్లాడుతూ పట్టభద్రులు కూటమి బల పరిచిన రాజశేఖరంను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో టీడీపీ మండలాధ్యక్షులు ఆంధ్రూ అనీల్, రొంగలి సత్యనారాయణ, తాతిన సత్యనారాయణ, నాయకులు సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, పిన్నమనేని సత్యనారాయణ, బళ్లా సూర్యచక్రం, పసుమర్తి గంగాధర్, దుర్గాప్రసాద్, రఘురామ్, కూనపం ప్రసాద్‌బాబు, చావా గోకుల్, ఉన్నమట్ల సత్యకిరణ్, గుదె సుబ్బారావు, చెల్లు సత్యనారాయణ పాల్గొన్నారు

కొవ్వూరు: కొవ్వూరులోని సర్వేపల్లి రాధాకృష్ణన్ హైస్కూల్, గవర్నమెంటు హైస్కూల్, అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ, స్టేట్ బ్యాంకులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కంఠమణి రామకృష్ణారావు, ఎన్నికల పరిశీలకుడు కోట్నీ బాలాజీ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు, బర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక టీడీపీ పార్లమెంటు కార్యాలయంలోఎమ్మార్పీఎస్ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్ మాట్లాడుతూ పేరాబత్తుల రాజశేఖరంనకు ఎమ్మార్పీ ఎస్ఎస్ పూర్తి స్థాయి మద్దతు తెలియజేసిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో తిరిగి ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి, అభివృద్ధి, సంక్షేమం, కూటమి పాలనను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాభివృద్ధికి పట్టం గట్టాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించి రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌కు రాజకీయ సన్యాసం అప్పజేప్పాలన్నారు. కార్యక్రమంలో బుంగా సునీల్‌దత్, కొడమంచిలి సూర్య, సొంగా ప్రసాద్, నికోలస్ రాజు, బజ్జింగ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద పలు శాఖల అధికారులు, ఉద్యోగులతో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. పేరాబత్తుల రాజశేఖరంనకు తమ మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సూరపనేని చిన్ని, నామన పరమేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట్నీస్, ఇందుగుల రామకృష్ణ, ఉడతా వీరేంద్ర, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి



పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున ఆర్డీవో సుస్మిత

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొవ్వూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో రాణిసుస్మిత పరిశీలించారు. మంగళశారం సాయంత్రం కొవ్వూరులోని బాలుర జూనియర్ కళాశాల, హైస్కూల్ ప్రాంగణంలో 4, మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో 4 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటు హక్కు వినియోగించడానికి వచ్చే ఓటర్లకు అవసరమైన కనీస సౌకర్యాలపై ఆరాతీశారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకంగా 'హేవలాక్' అభివృద్ధికి చర్యలు

కొవ్వూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు కృషి: ఎంపీ పురందేశ్వరి



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పురందేశ్వరి, జవహర్

కొవ్వూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాల నాటికి హేవలాక్ వంతెనను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ పార్లమెంటు కార్యాలయానికి విచ్చేసిన ఆమెకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశీష్‌లాల్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పురందేశ్వరి పాత్రికేయులతో మాట్లాడుతూ కొవ్వూరు రైల్వేస్టేషన్‌ల్లో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేయకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. సికింద్రాబాద్‌లో రైల్వే జనరల్ మేనేజర్‌ని, రైళ్ల నిలుపుదలకు ప్రత్యేక విభాగం ఉందని, వారిని కలిసి కొవ్వూరులో అన్ని ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. హేవలాక్ వంతెన, గోదావరి స్నానఘట్టాల అభివృద్ధికి కేంద్రం రూ.90 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. డిజైన్స్, డీపీఆర్‌లు సిద్ధమైన వెంటనే పనులు ప్రారంభమవుతాయన్నారు. పుష్కరాలకు రాజమహేంద్రవరంతో పాటు కొవ్వూరు, నిడదవోలులను అభివృద్ధి చేయాలని దృష్టిసారిస్తున్నామన్నారు. వాటిపై డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. కార్యక్రమంలో పరిమి రాధ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, తాడిమళ్ల విజయవాణి, సలాధి సందీప్‌కుమార్, డేగల సునీత, ఇందుగుల రామకృష్ణ పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులకు సంఘటిత కృషి

ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు



ఏపీడబ్ల్యూజేఎఫ్ గోపాలపురం నియోజకవర్గ కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఆంజనేయులు

నల్లజర్ల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పాత్రికేయులందరూ వారి హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం అచ్చన్నపాలెంలోని కాకర్ల గంగరాజు కళ్యాణ మండపంలో గోపాలపురం నియోజకవర్గ జర్నలిస్ట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నూతన అధ్యక్షుడు కండెలి శేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ ప్రతి జర్నలిస్ట్ సత్యం కోసం పని చేయాలన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి ప్రతి నియోజకవర్గంలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా కండెల్లి శేఖర్, గౌరవాధ్యక్షుడిగా సజ్జ రమేష్, ఉపాధ్యక్షుడిగా కొడవటి బుజ్జిబాబు, ప్రధాన కార్యదర్శిగా కాకర్లమూడి రాజేశ్వరరావు, కోశాధికారిగా షేక్ హుస్సేన్, చెట్టి ప్రసాద్ ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సిరా రాజు, కలపాల శ్రీనివాస్, మర్రి రమేష్, తోట రాము,ఎం.పద్మావతి పాల్గొన్నారు.

తాళ్లపూడిలో మూడు పోలింగ్ కేంద్రాలు



పోలింగ్ కేంద్రాల వద్ద మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జోడాల

తాళ్లపూడి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్క పట్టభద్రుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, వారి కోసం తాళ్లపూడిలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావుతో కలిసి ఆమె పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఏఎస్‌వో జోడాల మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశామని ఓటు వేయడానికి వచ్చేవారు గుర్తింపు కార్డుతో రావాలని, అక్కడ ఇచ్చే పరికరంలో నచ్చిన అభ్యర్థి పేరు ఎదురుగా ప్రాధాన్య అంకెలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు సంజీవ్, తీలావతి, ప్రకాష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కొవ్వూరు అధ్యక్షుడిగా బుచ్చిబాబు

కొవ్వూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు నియోజకవర్గంలో పట్టణ, మూడు మండలాల అధ్యక్షులను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించినట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ ఫసీయుల్లా బేగ్ తెలిపారు. కొవ్వూరు పట్టణాధ్యక్షుడిగా బచ్చు బుచ్చిబాబు, మండలాధ్యక్షుడిగా సుంకర కృష్ణారావు, చాగల్లు మండలాధ్యక్షుడిగా మట్టా సుబ్బారావు, తాళ్ళపూడి మండలాధ్యక్షుడిగా కొడమంచిలి చంద్రశేఖర్‌లను నియమిస్తూ ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులను ఆకర్షించాలి



చాగల్లు శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో గురునాథం

- శిక్షణ ముగింపులో ఎంఈవో గురునాథం

చాగల్లు, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను ఆకర్షించే విధంగా కేంద్రాలు నిర్వహించాలని బోధనకు అవసరమైన ఉపకరణాలు తయారు చేసుకోవాలని ఎంఈవో యు.గురునాథం అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో ఆరు రోజులు పాటు జరిగిన అంగన్‌వాడి కార్యకర్తల శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మి మాట్లాడుతూ చిన్నారులకు ప్రాథమిక దశలోనే చక్కని విద్యను అందించి వారు కేంద్రాలకు వచ్చే విధంగా తగిన కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పి.పద్మావతి, జి.శిరీష, ప్రధానోపాధ్యాయుడు మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక జడ్పీ హైస్కూల్లో ఎంఈవోలు తిరువ౦లదాసు, అప్పా రావు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆఖరి రోజున అసైన్‌మెంట్ హబ్‌పై ఎంఈవోలు వివరించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ సమగ్రాభివృద్ధిపై గ్రూపుల వారీగా అసైన్‌మెంట్ ఏవి ధంగా చేయాలనేది పునాది అని, అభ్యాసం మెరుగుపరిచే విధంగా తల్లులను ఏ విధంగా ఉత్తేజితం చేయాలనే విషయంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, డీఆర్‌పీలు మహాలక్ష్మి, శ్రీదేవి, విజయశాంతి, నీరజ, విజయలక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



దేవరపల్లిలో శిక్షణా తరగతుల్లో పాల్గొన్న అంగన్వాడీలు

చంద్రవరంలో ఉచిత వైద్య శిబిరం



ఉచితంగా మందులు అందజేస్తున్న దృశ్యం

చాగల్లు, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారం, తగిన వ్యాయామం లేకపోతే ఎముకలు పటుత్వం కోల్పోతాయని వెన్నెముక వైద్య నిపుణులు డాక్టర్ తేజో ఫణీంద్ర అన్నారు. మండలంలోని చంద్రవరంలో వేద హాస్పిటల్ (రాజమహేంద్రవరం) ఆధ్వర్యంలో వెన్నెముక సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఎం.శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకుడు మద్దిపాటి వీరరాఘవు శిబిరాన్ని ప్రారంభించారు. మల్లవరం, చంద్రవరం, గౌరిపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫణీంద్ర, డాక్టర్ లక్ష్మి మృదుల వైద్య సేవలందించారు.